క్లుప్తంగా

అర్హులు ఓటు నమోదు చేసుకోవాలి

ఇంద్రవెల్లి: మండలంలోని ఏమాయికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని రమాయినగర్, సుందర్‌నగర్ వాసులు ఏమాయికుంట 10వ నెంబర్ పోలింగ్ బూత్ పరిధిలో తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్‌ఐ మెస్రం లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఇటీవల కొత్తగా ఓటుహక్కు నమోదు చేసిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యూహీరాపూర్, సుందర్‌నగర్ గ్రామాలు ఏమాయికుంట గ్రామపంచాయతీ పరిధిలోకి వస్తాయన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఇంద్రవెల్లి: వసతి గృహాల్లో విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యురాలు పూజిత అన్నారు. శుక్రవారం మండలంలోని వడగామ్ ఆశ్రమ పాఠశాలను సందర్శించి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పిట్టబొంగరం ప్రభుత్వ ఆస్పత్రి హెచ్‌వో గోకుల్, హెల్త్ సూపర్‌వైజర్ జలేందర్, హెల్త్ అసిస్టెంట్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని శిశు గృహ చిన్నారులకు హీటర్‌తో పాటు దుస్తులు పంపిణీ చేశారు. వీటిని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అందజేశారు. ఇందులో సత్యసాయి సేవా సమితి సభ్యులు నర్సింగ్‌రావు, విజయ్‌రెడ్డి, అశోక్, వీణ పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో దివ్యాంగుల విద్యార్థులకు శుక్రవారం కౌన్సిలర్ విజయలక్ష్మి దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భూమన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

సిరికొండ: కుటుంబసర్వే వివరాలను పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీవో ఫణీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఆపరేటర్లు ఎలాంటి పొరపాట్లు, తప్పులు లేకుండా సమగ్ర సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

సింహగర్జన విజయవంతం చేయండి

ఎదులాపురం: జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. మాలలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలకు నిధులు మంజూరు చేయండి

బోథ్: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ కేంద్రం మంత్రి సముద్రాల వేణుగోపాలచారిలతో కలిసి మంత్రి కొండా సురేఖను కలిశారు. బోథ్‌లోని శ్రీ భక్త శివ మార్కండేయ ఆలయ నిర్మాణానికి టెండర్లు పిలవాలని కోరారు. ఆదివాసీల గూడెల్లో వారి సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడేలా ఆలయాలను నిర్మించేలా చూడాలన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమురం కోటేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మెరుగు భోజన్న, గంగుల మల్లేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడ పాఠశాలకు చెందిన విద్యార్థులు జోనల్‌స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఎస్జీఎఫ్ అండర్ 14, 17 జోనల్‌స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీల్లో 9 పతకాలతో మెరిశారు. అండర్– 14 విభాగంలో వెంకట్, పవన్, ప్రణవ్, నిఖిల్ గోల్డ్ మెడల్స్ సాధించారు. వివేక్ సిల్వర్ మెడల్‌తో నిలిచాడు. అండర్–17 విభాగంలో రామ్‌చరణ్ గోల్డ్ మెడల్‌తో సత్తా చాటగా.. అండర్–17 బాలికల విభాగంలో నిహారిక, అనూష, వివేకవర్ధినిలు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు బాక్సింగ్ కోచ్ సాయి తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలురలో విద్యనభ్యసిస్తున్న నితీష్, సయ్యద్ జైద్ అండర్ –19 విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాదులోని లాలాగూడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

శిథిలావస్థలో డీఆర్‌డిపో

- బియ్యం నిల్వలకు ఇబ్బందులు
- అద్దె గదుల్లో నిర్వహణ
- దూరభారంతో వినియోగదారుల ఇక్కట్లు



శిథిలావస్థకు చేరిన డీఆర్‌డిపో భవనం

సిరికొండ: మండల కేంద్రంలోని కొనసాగుతున్న గిరిజన సమగ్ర సంస్థ గిరిజన ప్రైమరీ కోఆపరేషన్ సొసైటీ డీఆర్‌డిపో భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో బియ్యం నిల్వ చేయడం ఇబ్బందిగా మారింది. వర్షాకాలంలో బియ్యం నిల్వ ఉంచిన భవనంలోకి వర్షం నీరు చేరి బియ్యం పనికి రాకుండా పోతున్నాయి.

అద్దె భవనంలో..

రేషన్ కోటా భవనం శిథిలావస్థలకు చేరి కూలిపోయే అవకాశం ఉంది. ఏ సమయంలోనైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అలాగే బియ్యం వినియోగారులు తీసుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సదరు రేషన్ డీలర్ అధికారులుకు సమాచారం ఇవ్వడంతో గత రెండు సంవత్సరాల నుంచి అద్దె భవనంలో బియ్యం పంపిణీ చేస్తున్నారు. సిరికొండలో 741 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతి నెలా సుమారు 150 క్వింటాళ్ల బియ్యం కోటాకు చేరుతున్నాయి. వీటిని నిల్వ ఉంచేందుకు అద్దె గది సరిపోకపోవడం తిప్పలు తప్పడం లేదు.

దూరభారం..

రేషన్ కోటా డీఆర్‌డిపో భవనం శిథిలావస్థకు చేరడంతో ఇక్కడి నుంచి గ్రామ శివారులోకి తరలించడంతో వినియోగదారులకు దూరభారం తప్పడం లేదు. కొంత మంది వాహనాల ద్వారా తెచ్చుకుంటే మరికొంత మంది అక్కడి నుంచి బియ్యం తలమీద పెట్టుకొని ఇంటికి రావాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పకైనా అధికారులు సిరికొండకు నూతనంగా భవనం మంజూరు చేయించి, కష్టాలు తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

బియ్యం మోసుకెళ్తున్నాం



గ్రామంలో రేషన్ కోటా భవనం కూలిపోయే స్థితికి చేరడంతో గ్రామం నుంచి కొంచెం దూరంలో అద్దె గదిలో ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఇంటికి బియ్యాన్ని తలపై పెట్టుకుని మోసుకెళ్తున్నాం

– సిడాం శంభు, సిరికొండ

భవనం మంజూరు చేయాలి

డీఆర్‌డిపో భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో నీరు చేరి బియ్యం తడిసి పోయేవి. దీంతో చాలా ఇబ్బంది పడేవాళ్లం. దీంతో అధికారులకు తెలిపి అద్దె గదికి మార్పు చేశాం. ప్రభుత్వ అధికారులు నూతన భవనం మంజూరు చేయించాలి.

– విజయ లక్ష్మి, సేల్స్‌మన్, సిరికొండ

పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేత



క్రీడా పరికరాలు అందజేస్తున్న గంగారాం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలో గల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆట వస్తువుల కొరత ఉండటంతో గ్రామానికి చెందిన పాముల విష్ణు గ్రామస్తుల దృష్టికి తీసుకువచ్చారు. కాగా ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందిన చౌకి చంద్రకాంత్, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.కె.హైదర్, ప్రైవేట్ ఉద్యోగి రత్నపురం లింగన్నలు తమ వంతుగా పాఠశాల అభివృద్ధి రూ. రూ.8 వేలు విరాళం అందజేశారు. ఆర్ఎంపీ వైద్యులు గంగారం చేతుల మీదుగా విద్యార్థులకు క్రీడా పరికరాలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, ఉపాధ్యాయులు సంగీత, షేక్ అలీ పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

ఉట్నూర్‌రూరల్: ములుగు జిల్లా మేడారం గ్రామంలో కొలువుదీరిన సమ్మక్క సారలమ్మలను ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. సమ్మక్క సారక్క గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. వారి వెంట దేవాలయ శాఖ ఈవో కొప్పుల రవి, పూజారి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

‘పరీక్ష కేంద్రాన్ని మార్చడం సరికాదు’



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బేల: కాకతీయ యూనివర్సిటీ అధికారులు మండల కేంద్రంలోని డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని పదే పదే జిల్లా కేంద్రానికి మార్చడం సరికాదని జిల్లా ఏబీవీపీ హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై స్థానిక పరీక్ష కేంద్రం కోసం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు పరీక్షల కోసం మండల కేంద్రానికి రావడానికే సరైన రవాణా సౌకర్యం లేదన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లడం ఇబ్బంది పడుతున్నారన్నారు. పరీక్ష కేంద్రాన్ని శాశ్వతంగా మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలన్నారు. ఘటన స్థలానికి చేరుకున్న మండల తహసీల్దార్ కొట్నాక రఘునాథ్ రావు, సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు రేసు మనోజ్ రెడ్డి, గుంజేవార్ మహేశ్, నార్లవార్ అజయ్, తరుణ్, బాలాజీ, కన్నె సాయిరెడ్డి పాల్గొన్నారు.

బహుమతులు అందజేత



బహుమతిని అందజేస్తున్న ఎంఈవో

బేల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి చెకుముకి పోటీల విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను మండల విద్యాధికారి కోల నర్సింలు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ గోరే బేబీతాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘హామీల అమలులో సీఎం విఫలం’



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మహిళల ఆత్మగౌరవంతో పాటు విద్యార్థులకు భద్రత కరువైందన్నారు. పాము కాటుతో విద్యార్థులు చనిపోవడం బాధాకరమన్నారు. తెలంగాణకు ఉన్న ఇమేజ్‌ను రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి వారి ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారన్నారు. సీఎంపై 420 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, రాజు, గంగయ్య, అశోక్ స్వామి, భూమన్న, శ్రీనివాస్, సతీశ్, సృజన్, దయానంద్, లక్ష్మణ్, అరవింద్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

బోథ్: మండలంలోని గుట్టపక్కతండా మాజీ సర్పంచ్ సక్కర్బాల్ సరిత శుక్రవారం మృతి చెందారు. గత ఏడాది కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ ఉంది. ఆమె గ్రామంలో మహిళా సర్పంచుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మృతురాలికి భర్త గులాబ్ సింగ్, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌ను కలిసిన నాయకులు

బోథ్: కరీంనగర్ గ్రంథాలయం చైర్మన్ సత్తు మల్లయ్యను బోథ్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ హైదరాబాద్‌లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. నాయకులు కోటేశ్వర్, చంటి, తదితరులు ఉన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: డిజిటల్ లావాదేవీలపై విద్యార్థులతో పాటు వయోవృద్ధులకు అవగాహన ఉండాలని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని శ్రీసరస్వతి శిశు మందిర్‌లో హెరిటేజ్ ఇండియా ఆధ్వర్యంలో డిజిటల్ గురుకుల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో డిజిటల్ లావాదేవీలు పెరిగిపోయాయన్నారు. శిశు మందిరాలు క్రమశిక్షణకు, నిలయాలుగా నిలుస్తున్నాయన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు వారిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేవ్‌పాండే, కార్యదర్శి రామ్ కులకర్ణి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, వామనరావు, సుధాకర్, హన్మంత్‌రెడ్డి, నీలాకిషన్, కిషోర్ పాల్గొన్నారు.

విలేజ్ పోలీస్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలి

- ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఎస్పీ నాగేందర్

నేరడిగొండ: పంచాయతీ ఎన్నికలు రానున్న దృష్ట్యా విలేజ్ పోలీస్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అంతకుముందు నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ డీఎస్పీకు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఆయన వెంట ఇచ్చోడ సీఐ భీమేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

టీపీసీసీ సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి



సమావేశంలో పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి

కైలాస్‌నగర్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశానికి ఆదిలాబాద్‌కు చెందిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొరంచు శ్రీకాంత్ రెడ్డి హాజరయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు, కులగణన సమగ్ర సర్వే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

వసతిగృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు మిఠాయి తినిపిస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ ప్రజల అభిమానంతోనే సేవ చేసే భాగ్యం, నియోజకవర్గ ప్రజల అభిమానంతోనే సేవ చేసే భాగ్యం కలిగిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. సానుకూలంగా స్పందించిన సీఎం బీసీ శాఖ మంత్రితో చర్చించి కమిటీలు వేసి మెస్ చార్జీలు పెంచి ఆమోదం తెలుపడం జరిగిందన్నారు. వసతి గృహాలపై నమ్మకంతో అనేక మంది పేదలు తమ పిల్లల్ని వసతి గృహా సిబ్బంది చేతిలో పెడతారని, అన్నారు. మెస్ చార్జీలు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు ఎమ్మెల్యేకు మిఠాయి తినిపించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట హెచ్‌డబ్ల్యూవో శివకుమార్, తదితరులు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

తలమడుగు: బోథ్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లి(బి),పల్లి(కె), అర్లి(కె) గ్రామాలకు మంజూరైన బీటీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతీ గ్రామానికి రోడ్ల నిర్మించేందుకు చర్యలు చేపడుతానన్నారు. అనంతరం శాలువాతో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేశ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేదరేశ్వర్ రెడ్డి, పిడుగు అభిరామ్ రెడ్డి, రమాకాంత్, సురేందర్ రెడ్డి, గజానంద్, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

కార్పొరేట్ వైద్యం అందించేందుకే సీఎంఆర్ఎఫ్

నేరడిగొండ: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకే ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పలువురి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, పిడుగు అభిరాం రెడ్డి, సంతోష్, బుచ్చన్న, శ్యామ్, రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.

నిజమైన కాంగ్రెస్ వాదులకే ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న దర్శనాల చంటి

ఎదులాపురం: నిజమైన కాంగ్రెస్ వాదులకే పదవుల కేటాయింపుల్లో ప్రాధాన్యమితవ్వాలని కాంగ్రెస్ నాయకుడు దర్శనాల చంటి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని, గెలుపోటములను లెక్కచేయకుండా పార్టీ విజయానికి శ్రమించారన్నారు. అయితే పలువురు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరి, ఇప్పుడు పదవుల కోసం పైరవీలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తూ వస్తున్నానన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలని రాష్ట్ర మంత్రులకు సైతం వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. చైర్మన్ పదవి నియామకం విషయంలో తనను పరిగణలోనికి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారికి పదవులు కేటాయించడం సరికాదని, అన్ని అర్హతలు ఉన్న తనకు పదవిని కేటాయించాలని కోరారు.

నూతన సభ్యులకు సత్కారం



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) నూతనంగా నియమితులైన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. శుక్రవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో గల కుమరం భీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశానికి నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల కిందట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా జిల్లాల కమిటీలను నియమించడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని మావల, అదిలాబాద్ రూరల్, ఆదిలాబాద్ అర్బన్ మండల కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెందూర్ దాదిరావు, వెట్టి మనోజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నైతం రమేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావు, సోయం రాందాస్, ప్రచార కార్యదర్శి విష్ణు, గేడం భరత్, గేడం రాము, కోశాధికారి బారిక్ రావు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఈనెల 24న నిర్వహించనున్న వీడీసీ సమావేశాన్ని విజయవంతం చేయాలని గ్రామపెద్ద రేణిగుంట సురేశ్ అన్నారు. శుక్రవారం ఉదయం యువతకు ఆహ్వాన పత్రాలు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూతన వీడీసీ కమిటీ ఎన్నుకుంటామన్నారు.

పరిహారం చెక్కు అందజేత

బేల: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఇండియాలో శుక్రవారం గతంలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన కింద బీమా చేసుకున్న లబ్ధిదారులు నివాల్కర్ అనురాధకు రూ.2 లక్ష పరిహారం చెక్కును బ్యాంకు మేనేజర్ బొంత అశోక్ అందజేశారు. పీఎంజేజేవై కింద బీమా ప్రీమియం చెల్లించిన ఖాతాదారుడు సంతోష్ సహజ మరణం పొందడంతో ఆ చెక్కును బాధిత కుటుంబానికి అందజేశామన్నారు.

పరామర్శ

ఇచ్చోడ: మండలంలోని పట్వారిగూడలో శుక్రవారం కిన్నర్ల మనోహర్ రెడ్డి కుటుంబాన్ని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పరామర్శించారు. గత ఐదు రోజుల క్రితం రిటైర్డ్ తహసీల్దార్ కిన్నర్ల మనోహర్‌రెడ్డి అన్న గోవర్ధన్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయన వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన పలువురు వివిధ కారణాలతో మరణించడంతో శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. రుయ్యాడి గ్రామానికి చెందిన మిత్తయ్య భార్య సుభద్ర, శంకర్ మాతృమూర్తి దేవుబాయి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

తలమడుగు: విద్యార్థులు కష్టపడి చదవడం అలవర్చుకోవాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. శుక్రవారం మండలంలోని ఉమ్రీ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదులు, స్టోర్ రూం, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే కష్టపడి చదవాలన్నారు. పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బంది, ప్రధానోపాధ్యాయురాలు అరుణ, వార్డెన్ హిరమన్, తదితరులు పాల్గొన్నారు.